ప్రజాశక్తి
సోమవారం 11 నవంబరు 2024
5
శ్రీకాకుళం

ఫోన్ కాల్‌తో ఆర్‌టిసి బస్సు

శ్రీకాకుళం : ఒక్క ఫోన్ కాల్‌తో మీ వద్దకు ఆర్‌టిసి బస్సు అనే నినాదంతో ప్రజలకు సేవలందిస్తున్నట్లు శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు అమరసింహుడు, శర్మ తెలిపారు. నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో పంచారామాల క్షేత్ర దర్శిని ప్రత్యేక బస్సుని వారు జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచారామ క్షేత్రాలైన అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను సందర్శించడానికి సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం ఈ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 17, 24 తేదీల్లో సాయంత్రం నాలుగు గంటలకు శ్రీకాకుళం బస్ కాంప్లెక్స్ నుంచి బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. పంచారామ క్షేత్రాల సందర్శన అనంతరం మంగళవారం తెల్లవారుజామున శ్రీకాకుళం చేరుకుంటాయన్నారు.

ప్రజలతో మమేకం కావాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- గిరిజనుల భూముల ఆక్రమణ కార్పొరేట్ లూటీలో భాగమే
- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్
- ముగిసిన సిపిఎం జిల్లా 18వ మహాసభలు
- జిల్లా కార్యదర్శిగా డి.గోవిందరావు

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజ సమస్యలపై నిరంతర పోరాటాల ద్వారా వారితో మమేకం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కాశీబుగ్గలోని కీ.శే సీతారాం ఏచూరి నగర్ (కాశీబుగ్గ రైల్వే కాలనీ)లోని కీ.శే కొల్లి సత్యనారాయణ, కీ.శే బమ్మిడి శ్రీరాములు ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సిపిఎం జిల్లా 18వ మహాసభల ముగింపు సభ సందర్భంగా ఆదివారం ఆయన ప్రసంగించారు. ఉద్యమాల్లో ప్రజలను భాగస్వామ్యులను చేసేలా నిర్ణయాలు తీసుకుని సమన్వయం, ఐక్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ ప్రారంభోపన్యాసం చేస్తూ మూలపేట పోర్టు పేరుతో నౌపడ ఉప్పు భూములను కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నాలు అడ్డుకోవాలన్నారు. మూలపేట పోర్టుతో పాటు ఉప్పు భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. జిల్లాలో గిరిజనులకు చెందిన సుమారు 300 ఎకరాల భూములను తప్పుడు పత్రాలతో ఒడిశా ప్రాంతంతో పాటు తూర్పుగోదావరి, నెల్లూరు వంటి ప్రాంతాల నుంచి భూస్వాములు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారని చెప్పారు. గిరిజనులు, దళితుల భూముల స్వాధీనం కార్పొరేట్ లూటీలో భాగమేనన్నారు. ప్రజల సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించే కర్తవ్యాన్ని నిర్వహించాల్సిన అవసరముందన్నారు. సోంపేట థర్మల్ ఉద్యమం స్ఫూర్తితో దోపిడీని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సాధారణ మత్స్యకారులకు ఉపయోగపడే భావనపాడు ఫిషింగ్ హార్బర్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం విద్యుత్ ఇంధన సర్దుబాటు ఛార్జీలు విధించడంతో డిసెంబర్ ఒకటి నుంచి ప్రజల జేబులకు చిల్లులు పడనున్నాయని చెప్పారు. విద్యుత్ ఛార్జీలపై ప్రజల్లో అవగాహన కల్పించి వామపక్షాలు చేపట్టనున్న ఆందోళనల్లో వారిని భాగస్వామ్యం చేయాల్సిన అవసరముందన్నారు.

పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వి.జి.కె మూర్తి

వామపక్షాలను ఐక్యం చేసి ప్రజా ఉద్యమాలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు అవసరమైన భూమికను పోషించేలా మహాసభ నిర్ణయాలు ఉండాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు

సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. ప్రజలను ఉద్యమాలకు సిద్ధం చేసేలా మహాసభ నిర్ణయాలు ఉండాలని తాము ఆశిస్తున్నామని చెప్పారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. పాలకుల తప్పిదాలను ప్రశ్నిస్తున్న వారిపై తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నారని చెప్పారు.

జిల్లా సమగ్రాభివృద్ధి తీర్మానానికి ఆమోదం

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం మహాసభ సూచించిన అంశాలపై రూపొందించిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. తీర్మానాన్ని సిపిఎం నాయకులు కె.శ్రీనివాసు ప్రవేశపెట్టగా నాయకులు ఎన్.షణ్ముఖరావు బలపరిచారు.

సిపిఎం జెండా ఆవిష్కరణ

మహాసభ రెండో రోజున ప్రాంగణంలో సిపిఎం జెండాను సీనియర్ నాయకులు వి.జి.కె మూర్తి ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళ్లు అర్పించారు. వేదిక వద్ద కీ.శే సీతారాం ఏచూరి, కొల్లి సత్యనారాయణ, బమ్మిడి శ్రీరాములు చిత్రపటాలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు పలు విప్లవ గీతాలను ఆలపించారు.

జిల్లా కార్యదర్శిగా గోవిందరావు

13 మందితో సిపిఎం జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు, జి.సింహాచలం, పి.తేజేశ్వరరావు ఎన్నికయ్యారు.

బాబు బడ్జెట్‌లో... సిక్కోలుకు భాగమెంతో..?

- నిధుల కొరతతో ముందుకు సాగని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు
- కొత్త పథకాలు, ప్రాజెక్టులపై జిల్లా ప్రజల ఎదురుచూపులు
- నేడు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి బడ్జెట్ ప్రవేశపెడుతుండడంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. సంక్షేమానికి తప్ప అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వంశధార, ఆఫ్‌షోర్, మడ్డువలస వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కొరత వెంటాడుతోంది. ప్రతి బడ్జెట్‌లో అరకొర నిధుల కేటాయింపు, వాటినీ పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదు. దీంతోపాటు ప్రభుత్వం కొత్తగా ఇచ్చే హామీలు, జిల్లాకు ప్రకటించనున్న అభివృద్ధి ప్రాజెక్టులపై జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. వంశధార, ఆఫ్‌షోర్, జలవనరులశాఖ పరిధిలోని ప్రాజెక్టుల కోసం అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపారు. వంశధార ప్రాజెకు-1కు రూ.56.56 కోట్లు కావాలని అడగగా, గత ప్రభుత్వం కేవలం రూ.3.89 కోట్లే ఇచ్చింది. ఇప్పుడు ఆ ప్రాజెక్టు నిర్వహణ కోసం రూ.10 కోట్లు ప్రతిపాదనలు పంపారు. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2కు రూ.476.54 కోట్లు అవసరమని ప్రతిపాదించగా, బడ్జెట్‌లో రూ.180.73 కోట్లు కేటాయించింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.200 కోట్లు కావాలని ప్రతిపాదించారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.38 కోట్లు సర్దుబాటు చేసినట్లు తెలిసింది. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టుకు రూ.231 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపగా, గత వైసిపి ప్రభుత్వం రూ.9.36 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం అధికారులు రూ.120 కోట్లు కావాలని అడిగారు. ఇందులో ఇప్పటికే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.28 కోట్లు ఇచ్చినట్లు తెలిసింది. జలవనరుల శాఖ ద్వారా చేపట్టనున్న సాగునీటి ప్రాజెక్టుల కోసం అధికారులు సుమారు రూ.480 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. పైడిగాం ఆధునీకరణ కోసం రూ.36 కోట్లు, ఒనిగెడ్డ ఆధునీకరణ కోసం రూ.12.50 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు. ఇటీవల ఈదుపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఈదుపురం ఓపెన్‌హెడ్ ఛానల్ కోసం రూ.21 కోట్లు అవసరమని ప్రతిపాదించారు.

'నేరడి'కి నిధుల కేటాయింపు జరిగేనా?

నేరడి ప్రాజెకుకు భూసేకరణ, ఒడిశాలో సేకరించనున్న 106 ఎకరాలకు పరిహారం కోసం వంశధార ప్రాజెక్టు అధికారులు గత మూడేళ్లుగా రూ.60 కోట్ల అంచనాతో ప్రతిపాదనలను పంపుతూనే ఉన్నా కేటాయింపులు జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం దీనికి ఏమేరకు ప్రాధాన్యం ఇస్తుందో చూడాల్సి ఉంది.

ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలకు నిధులు కేటాయిస్తారా?

సంతబొమ్మాళి మండలం భావనపాడు వద్ద ఫిషింగ్ హార్బర్ కోసం ప్రభుత్వం ఏ మేరకు నిధులు ఇవ్వనుందోనని మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. దీంతోపాటు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద ప్రతిపాదించిన ఫిషింగ్ హార్బరు నిర్మాణమూ నిధుల కేటాయింపుల్లేక ముందుకు సాగడం లేదు. వీటితోపాటు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద ప్రతిపాదించిన జెట్టీ నిర్మాణమూ ముందుకు సాగడం లేదు.

ఐటిడిఎ ఏర్పాటు నిర్ణయం ఉంటుందా?

సీతంపేట ఐటిడిఎ జిల్లాల పునర్విభజనలో పార్వతీపురం మన్యం జిల్లాకు తరలిపోయింది. సీతంపేట ఐటిడిఎ ఎప్పటి మాదిరిగానే తన పరిధిలోని మండలాలకు సేవలందిస్తుందని ప్రభుత్వం చెప్పినా, ఆ మేరకు సేవలు అందడం లేదు. జిల్లాలోని ఐటిడిఎ పరిధిలోని సబ్ ప్లాన్ మండలాలు, గిరిజన ప్రభావిత మండలాల ఆదివాసీలను పట్టించుకునే వారే కరువయ్యారు. జిల్లాకు కొత్తగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలని గిరిజనులు పలురూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. దీంతో ఆ అంశంపై ఏదైనా ప్రకటన ఉంటుందా అని ఆదివాసీలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు
(6లో)

ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

104ను ప్రభుత్వమే నిర్వహించాలి

- వేతన బకాయిలు చెల్లించాలి
- కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని 104 ఎంఎంయు ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. 104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జిఒ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ 104 ఎంఎంయు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన 104 ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

104 సేవల్లో 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిఒ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పిఎఫ్ మొత్తాలను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని కోరారు. డిఎస్‌సి ద్వారా ఎంపికైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టు విధానంలో కొనసాగించాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరావు, ధర్మాన కిరణ్, కోశాధికారి నవీన్, ఉపాధ్యక్షులు ఎం.రామారావు, వై.అసిరినాయుడు, సీతారామరాజు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రజామోదం మేరకే మాస్టర్ ప్లాన్

- అభ్యంతరాలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక
- సర్క్యులేషన్ ప్యాట్రన్ త్వరలోనే అమలు
- ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజామోదం మేరకే మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌పై చర్చా వేదికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌ను గతంలోని రూపొందించారని తెలిపారు. తాను ఎమ్మెల్యే అయిన వెంటనే మాస్టర్ ప్లాన్‌ను పూర్తిస్థాయిలో రూపొందించేందుకు ప్రభుత్వానికి మరికొంత సమయం కోరానన్నారు. అటు తర్వాత ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఆ సూచనలు, సలహాలను పొందుపరిచి మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఇంకా ఆలస్యం చేస్తే అమృత్ పథకం ద్వారా రావాల్సిన నిధులు వెనక్కి వెళ్లిపోతాయని చెప్పారు. మాస్టర్ ప్లాన్ అమల్లోకి వస్తే నియోజకవర్గ రూపురేఖలే మారిపోతాయన్నారు.

ఇంజినీర్లకు, ప్రజలకు, నిర్మాణదారులకు ఇబ్బందులు లేకుండా త్వరలోనే సర్క్యులేషన్ ప్యాట్రన్ కూడా అమల్లోకి వస్తుందన్నారు. ఇది అమల్లోకి వస్తే ఇంజినీర్లకు, ప్రజలకు ఎంతో సులభతరంగా ఉంటుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రెసిడెన్షియల్ ప్లాన్లు మాత్రమే ఇచ్చేందుకు అధికారాలు ఉన్నాయని, దీంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితులను పరిష్కరించేందుకు మిశ్రమ ప్లాన్లను అందించేందుకు ఇప్పటికే చర్చించామన్నారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ప్రజల నుంచి 155 అభ్యంతరాలు అందాయని, వీలైనంత త్వరగా వీటిని పరిశీలించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాల్సిందని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాద్, ఎంఇ, టిపిఒ ఉమామహేశ్వరరావు, టిడిపి నాయకులు, ఇంజినీర్లు, మున్సిపల్ అధికారులు, ఎల్‌టిపిలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు దొరికారు

- పది మంది అరెస్టు
- రూ.1.50 కోట్ల విలువైన రాగి వైరు, దిమ్మలు స్వాధీనం
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించి అందులో ఉన్న రాగి వైరు, సిల్వర్ తీగలను విక్రయిస్తున్న పది మంది సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జె.ఆర్ పురం సర్కిల్ పరిధిలోని ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జి.సిగడాం, పొందూరులోని గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లలో 53 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని తెలిపారు. ఇందుకు సంబంధించి 33 కేసులు నమోదైనట్లు చెప్పారు. శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, సిఐ అవతారం సమన్వయంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టామన్నారు. రణస్థలం మండలం బీరు ఫ్యాక్టరీ ఎదురుగా గల పాడుబడిన భవనం వెనకాల నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. అరెస్టయిన వారిలో ఎచ్చెర్ల మండలం అజ్జరాంకు చెందిన కుప్పిలి వరప్రసాద్, బోర సాయి, సడి సత్యం, ఎస్ఎస్ఆర్ పురానికి చెందిన బలగ రామకృష్ణ, బలగ శివ, బయ్యన్నపేటకు చెందిన బుడుమూరు గోవింద్, చిన్న అజ్జరాంకు చెందిన దువ్వ అసిరినాయుడు, విశాఖపట్నంకు చెందిన కృష్ణారెడ్డితో పాటు ఇద్దరు మైనర్లు ఉన్నారని చెప్పారు. మైనర్లను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి 636 కేజీల కాపర్ వైరు, దిమ్మలు, ఐదు కేజీల అల్యూమినియం వైరును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీటి విలువ సుమారు రూ.1.50 కోట్లు ఉంటుందని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై జల్సాగా బతకాలనే ఉద్దేశంతో తప్పుదోవ పట్టారన్నారు. చోరీ చేసిన వారిలో విశాఖపట్నంకు చెందిన కృష్ణారెడ్డికి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న మరో రెండు గ్యాంగులు జిల్లాలో ఉన్నాయని, వాటినీ త్వరలో పట్టుకుంటామన్నారు.

12 సోషల్ మీడియా కేసులు నమోదు

వ్యక్తిగత దూషణలు, కుటుంబ గౌరవాలను మంటగలిపే రీతిలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై జిల్లాలో 12 కేసులు నమోదు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. మరికొన్ని ఫిర్యాదులపై విచారణ చేస్తున్నామని చెప్పారు. విచారణలో వాస్తవాల ఆధారంగా చర్యలు మొదలు పెడతామన్నారు. సోషల్ మీడియాను మంచి కోసం మాత్రమే వాడాలని సూచించారు. ఈ కేసుల్లో అవసరమైతే అరెస్టులు తప్పవన్నారు. సమావేశంలో డిఎస్‌పి వివేకానంద, సిఐలు ఇమాన్యుయేల్ రాజు, అవతారం, రణస్థలం, ఎచ్చెర్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రీడాకారులు క్రమశిక్షణతో మెలగి ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో 68వ ఎపి ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ 2024-25 అండర్-19 బాలబాలికల ఛాంపియన్‌షిప్ పోటీలను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచామన్నారు. క్రీడాకారులల్లో ప్రతిభ గుర్తింపు, ప్రపంచస్థాయి శిక్షణ, ప్రోత్సాహకాలు, ఆర్థిక భద్రత, ఉద్యోగావకాశాలు, సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు జిల్లా వేదిక కావాల్సి ఉందన్నారు. ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పతకాలు సాధించిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచినట్లు తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో ముందుగా పలు జిల్లాల క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, డిఎస్‌డిఒ శ్రీధర్, కోచ్‌లు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో శాశ్వత పరిష్కారం

- అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్
- పిఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి
- సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ నంబరు
- ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ వాడకాన్ని దృష్టిలో పెట్టుకుని పిఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. సోలార్ విద్యుత్‌తో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ పొందవచ్చన్నారు. వినియోగదారులు తమ అవసరాలకు వీలుగా ఇంటి వద్దే విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాశక్తి ముఖాముఖిలో పలు అంశాలను ఆయన వెల్లడించారు.

పిఎం సూర్యఘర్ పథకం కోసం దరఖాస్తు ఎలా చేసుకోవాలి?

వినియోగదారులు తమ ఆండ్రాయిడ్ మొబైల్‌లో గూగుల్ ప్లేస్టోర్, ఆపిల్ ప్లే స్టోర్ నుంచి పిఎం సూర్య ఘర్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ యాప్ ద్వారా పిఎం సూర్య ఘర్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. యాప్ డౌన్‌లోడ్ అనంతరం రాష్ట్రం, జిల్లా, విద్యుత్ సరఫరా సంస్థ పేరు, 15 అంకెల విద్యుత్ బిల్లు సర్వీసు నంబరు (గృహ వినియోగదారులు), విద్యుత్ బిల్లుకు అనుసంధానమైన మొబైల్ నంబరు, ఇ-మెయిల్ పొందుపరిచి నమోదు కావాలి. యాప్ రిజిస్ట్రేషన్ అనంతరం మొబైల్ నంబరుతో లాగిన్ కావాలి. సోలార్ రూఫ్ టాప్, కిలోవాట్స్, సబ్సిడీ, బ్యాంకు వివరాలను పొందుపరిచి అప్లికేషన్ సమర్పించాలి. సోలార్ దరఖాస్తుదారుడు ప్రస్తుత గృహ వినియోగ కాంటాక్ట్ లోడ్, అంతకన్నా తక్కువ మాత్రమే వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలి. అనంతరం కిలోవాట్స్‌కి సంబంధించిన ఛార్జీలు చెలించాలి. వెబ్ పోర్టల్ నుంచి నిర్ధారణ పొందిన తర్వాత విద్యుత్‌శాఖ అధికారులు సంబంధిత గృహ ప్రదేశాన్ని పరిశీలించి సోలార్ నెట్ మీటరు ఏర్పాటు చేస్తారు.

జిల్లాలో ఈ పథకంపై వినియోగదారుల్లో స్పందన ఎలా ఉంది?

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద ఇప్పటివరకు 147 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 37 మందికి సోలార్ యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్‌ను వినియోగదారులు తమ అవసరాలకు వాడుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించుకోవచ్చు. జిల్లాలో ఎనిమిది లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వారిని ప్రోత్సహించి అర్హులైన రెండు లక్షల కుటుంబాలకు ఈ పథకాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ పథకంపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం.

విద్యుత్ కోతల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రస్తుతం ఎటువంటి విద్యుత్ కోతలు లేవు. నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాం. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై టోల్ ఫ్రీ నంబరు 1912ను అందుబాటులోకి తీసుకొచ్చాం. విద్యుత్ అంతరాయాలు ఉంటే ప్రజలు ఆ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన వెంటనే స్పందిస్తాం. వ్యవసాయానికి తొమ్మిది గంటల నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నాం. భవన నిర్మాణాల సమయంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా భవన యజమానులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పంట పొలాల్లో, సముద్రతీర ప్రాంత గ్రామాల్లో వేలాడే విద్యుత్ తీగల మరమ్మతులు, విద్యుత్ స్తంభాల డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ ద్వారా మార్పిడి చేస్తున్నాం. జిల్లాలో ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పొందడానికి సముద్రతీరంలో గ్రామాలను రెండు ఫేజ్‌ల్లో అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రభుత్వ శాఖల్లో సోలార్ వినియోగం ప్రతిపాదనలు ఎంతవరకు వచ్చాయి?

ప్రభుత్వ శాఖల పరిధిలో విద్యుత్ బకాయిలను దృష్టిలో ఉంచుకుని సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యేక పథకాన్ని ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమీకరిస్తోంది. పవర్‌గ్రిడ్‌ల మెయింటెనెన్స్, విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే జిల్లాలోని 611 ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ప్యానల్స్ మొదటి విడతలో అమర్చాలని భావిస్తున్నాం. కౌశల స్కీమ్ ద్వారా వీటి మార్పు జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, శ్రీకాకుళం జిల్లా

షార్ట్ టెండర్ ప్రకటన

టెండర్ నోటీస్ నెం.687/2021/ఏ1 — **తేది 10.11.2024.**

శ్రీకాకుళం జిల్లా పరిధిలో గల 16 ICDS ప్రాజెక్ట్‌ల పరిధిలో గల 3357 అంగన్వాడి కేంద్రములకు స్టేషనరీ, ఎక్విప్మెంట్ మరియు ఇతర సామానులు సరఫరా చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. తే 26.11.2024 దీన షీల్డు టెండర్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమం మరియు సాధికారత అధికారిణి శ్రీకాకుళం వారి కార్యాలయమునకు సమర్పించవలెను.

టెండర్లు స్వీకరణకు మొదలయ్యే తేదీ : తే 25.11.2024 ఉదయం 11-00 గంటలు
టెండర్లు స్వీకరణకు చివరి తేది : తే 26.11.2024 సాయింత్రం 5-00 గం.వరకు

సం/-xxxxxxxxx
జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు చైర్మన్
జిల్లా కొనుగోలు కమిటీ (SNP), శ్రీకాకుళం.

ఎమ్మెల్యే రమణమూర్తిని సత్కరిస్తున్న కృష్ణంనాయుడు

ఎమ్మెల్యేను కలిసిన కృష్ణంనాయుడు

ప్రజాశక్తి- పోలాకి

కళింగ సామాజికి వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రోణంకి కృష్ణంనాయుడు ఆదివారం మబగాం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువ కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణంనాయుడును అభినందించారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకుడు ఎం.వెంకట అప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, పంగ బావాజీ నాయుడు, భాస్కరరావు, సూరపు నారాయణదాసు, నల్లాన వెంకునాయుడు, అప్పలరెడ్డి, గిరిధర్, విశ్వశాంతి హైస్కూల్ డైరెక్టర్ మెట్ట జనార్దనరావు, ప్రగతి హైస్కూల్ డైరెక్టర్ ఇలపండ గణపతిరావు, బిజెపి నాయకులు కిల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఆలయ స్థలాన్ని పరిరక్షించాలి

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లి రెవెన్యూ పరిధిలో వెలసిన ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి కోసం గ్రామపెద్దలు 70 సెంట్లు భూమిని కేటాయించారు. అయితే ఆ భూమిని బంటుపల్లికి చెందిన తొలాపి వెంకట రమణ అనే వ్యక్తి ఆక్రమించాడని ఆలయకమిటీ సభ్యులు వెలిచేటి సురేష్ కుమార్, వెలిచేటి సుధాకర్ కుమార్, వెలిచేటి సింహాచల రాయుడు, వెలిచేటి రాజశేఖర్, ముంగం రమణ, గోపిన కృష్ణారావు, పిసిని అసిరప్పడు, పిసిని అప్పలనాయుడు తెలిపారు. అయితే శివాలయం కోసం ఈ స్థలాన్ని అక్రమదారుడు నుంచి తీసుకొని న్యాయం చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు ఆదివారం వినతిపత్రం అందించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రెవెన్యూ సిబ్బందితో మాట్లాడి సర్వే చేయిస్తానన్నారు.

సుభద్రాపురం కూడలిలో కప్పిన గొయ్యి

ఎట్టకేలకు గుంత పూడ్చివేత

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

లావేరు : ఎట్టకేలకు రహదారిపై ఉన్న గొయ్యిని ఎన్‌హెచ్ అధికారులు పూడ్చిపెట్టారు. మండలంలోని తాళ్లవలస పంచాయతీ సుభద్రాపురం కూడలిలో ఉన్న జాతీయ రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడడంతో పలు వాహనాలు ఆ గొయ్యిలో పడి వాహనదారులకు ప్రమాదాలు జరిగేవి. ఇటీవల ఆదమరిస్తే ఆపదే అనే శీర్షికతో 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితం కావడంతో జాతీయ రహదారి అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న గొయ్యిని శనివారం సిమెంట్, తారు తదితర మెటీరియల్‌తో కప్పడంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. పాదచారులు, వాహనదారులు 'ప్రజాశక్తి'కి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

క్రీడాకారులకు అభినందన

పోలాకి: చిత్తూరు జిల్లాలో ఇటీవల జరిగిన స్కూల్ మీట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నరసన్నపేట మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు విజయం సాధించడంతో ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరెన్నో పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాయికన్న, వ్యాయామ ఉపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ ఆలయంలో ప్రతినిత్యం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విశాఖ జిల్లా మధురవాడకు చెందిన జయంతి కృష్ణమూర్తి రూ.50 వేలు విరాళాన్ని కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీకి అందజేశారు. ఆదివారం ఆయన కుటుంబసభ్యులతో కలిసి అరసవల్లి సందర్శించారు. అనంతరం ఇఒ కార్యాలయంలో ఇఒకు చెక్కును అందజేశారు.

అరసవల్లి ఆదాయం రూ.8.55 లక్షలు

సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికుల రద్దీ పెరిగింది. దీంతో ఒక్కరోజు రూ.8.55 లక్షలమేర ఆదాయం సమకూరినట్టు ఇఒ తెలిపారు. టికెట్లు విక్రయాల ద్వారా రూ.4,71,800, విరాళాల రూపంలో రూ.1,08,002, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,75,935 ఆదాయం సమకూరినట్టు ఆయన తెలిపారు.

దళిత మహాసభ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- రణస్థలం

ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రణస్థలం మండలశాఖ నూతన కార్యవర్గం ఎన్నికలు జిల్లా దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి డి.రాము మాస్టర్, డి.కుసుమ ఆధ్వర్యంలో ఆదివారం రణస్థలం హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. అధ్యక్షులుగా డి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.రాము, గౌరవ అధ్యక్షులుగా కె.అప్పారావు, ట్రెజరర్‌గా కె.కుమార్, ఉపాధ్యక్షులుగా కె. రాజయ్య, కె.సీతారాం, ఎస్.శివ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.తవుడు, బి.శ్రీను, రాము, జాయింట్ సెక్రెటరీగా ముక్కు చెన్న, ఎం.సంతోష్, బి.అర్జున, మహిళా ప్రతినిధులుగా టి.రమ, వై.తౌడమ్మ, మీడియా కన్వీనర్‌గా డి.సూరిబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.సింహాద్రి, జిల్లా మహిళా ప్రతినిధిగా కె.సుభద్ర, సభ్యులుగా వై.సూర్యనారాయణ, నరసయ్యనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఇజిఎస్ పరిధిలో చేపడుతున్న రోడ్లు, కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అంబటి నిర్మలా దేవి అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ఇచ్చిన తీర్మానాల మేరకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు ఐక్యతగా ఉంటూ అభివృద్ధి పనులను సకాలంలో చేసుకోవాలని సూచించారు. గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి ఇది మంచి అవకాశమని, మన అందరి బాధ్యతన్నారు. ఒక్కో ప్రభుత్వం ఒక్కో తరహాలో అభివృద్ధి పనులు చేపడతాయని, ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ తమ గ్రామ అభివృద్ధి ఆకాంక్షగా ముందుకు సాగాలన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎన్‌ఆర్‌ఇజిఎస్ పరిధిలో చేపడుతున్న పనులను పెండింగ్ ఉంచకుండా పూర్తి చేయాలని, ఎంత మేర పనులు చేశారో, ఎంత మేర బిల్లులు పెండింగ్ ఉన్నాయో వివరిస్తే వాటిని చెల్లించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. రైతులకు సంబంధించిన ధాన్యం బిల్లులను శతశాతం అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు

శ్రీకాకుళం అర్బన్: తూర్పు కాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో త్వరలో వివిధ రంగాల్లో ప్రతిభా పాటవాలు ప్రదర్శించే వారిని సత్కరిస్తామని జిల్లా తూర్పుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు రాడ కైలాసరావు, డాక్టర్ ఎం.రామజోగినాయుడు, పడాల తమ్మినాయుడు తెలిపారు. ఆదివారం హోటల్ వినీలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో తూర్పుకాపు సామాజిక వర్గం బలోపేతానికి ఉద్యోగ సంఘం ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. తూర్పుకాపు ఉద్యోగ సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు వివిధ శాఖల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులంతా విధిగా సంఘంలో చేరాలని, తూర్పుకాపు సామాజిక వర్గం

మాట్లాడుతున్న కైలాసరావు

అభివృద్ధికి బాటలు వేయాలని వారు కోరారు. సమావేశంలో తూర్పుకాపు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శాసపు జోగినాయుడు, కిల్లారి నారాయణరావు, డాక్టర్ మజ్జి రామారావు, శ్రీరాములు నాయుడు, చిన్న వెంకట రమణ, తవిటన్న, హెచ్ఎం సత్యనారాయణ, చింతపల్లి జనార్ధన రావు, మహిళా ప్రతినిధి ఎస్.పార్వతి, సురేష్ పాల్గొన్నారు.

తైక్వాండోతో ఆత్మరక్షణ

శ్రీకాకుళం: దేశం గర్వించే స్థాయికి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎదగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. నగరంలోని టౌన్‌హాల్ వేదికగా జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యాన 38వ జిల్లాస్థాయి సబ్ జూనియర్ క్యూర్గీ, 13వ జిల్లాస్థాయి పూమ్ సే ఛాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. తైక్వాండో క్రీడకి జిల్లాలో ఆదరణ బాగా పెరిగిందని చెప్పారు. చిన్న పిల్లలు కూడా ఈ క్రీడలో రాణించాలని ఉత్సాహాన్ని చూపిస్తుండడం అభినంద నీయమన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు వాటిని తీసుకోవాలన్నారు. మెడల్స్ సాధించని వారు నిరాశకు గురికాకుండా మరింత ప్రాక్టీస్ చేసి ముందుముందు జరిగే పోటీల్లో విజేతలుగా

సర్టిఫికేట్లను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

నిలిచేందుకు కృషి చేయాలన్నారు. నిపుణులైన కోచ్‌లు ఇచ్చే సూచనలు పాటిస్తూ నిరంతరం సాధన చేయడం ద్వారానే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించగలరని తెలిపారు. ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవడం మంచి దేనన్నారు. అనంతరం విజేతలకు పతకాలు, సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను, సీనియర్ జర్నలిస్ట్ సుధీర్ వర్మ, బహుజన నేత కంఠ వేణు, టిడిపి నాయకులు రెడ్డి శంకర్, న్యూట్రీషన్ కోచ్ నాగరాజు, సంపతిరావు గోవిందరాజులు (నాయుడు) పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

కవిటి: క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఇచ్ఛాపురం సబ్ డివిజన్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే అశోక్‌ను కోరారు. ఈ మేరకు శనివారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ఒత్తిడితో సతమతమవుతున్న ఇంజనీ రింగ్ అసిస్టెంట్ల రేషనలైజేషన్ విషయంలో, టెక్నికల్ పే స్కేల్ విషయంలో తమకు న్యాయం జరగలేదని వాపోయారు. క్షేత్రస్థాయిలో ఎంత నిబద్ధతతో పనిచేస్తున్నా తమ సమస్యల పరిష్కార విషయంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా తమ పరిస్థితి తయారైంద న్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే అశోక్‌ను కోరారు. అంతేకాకుండా తమకు బిఎల్ఒ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అనంతరం

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, అదేవిధంగా ఐఎఎస్ కృష్ణతేజకి ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలను రాతపూర్వకంగా తెలియజేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రమణతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

మాజీ మంత్రి పరామర్శ

కోటబొమ్మాళి: సీనియర్ పాత్రికేయులు తలగాపు వెంకట రమణ భార్య ఝాన్సీ ఇటీవల కిడ్నీ వ్యాధితో బాధపడుతూ అనారోగ్యంతో మృతి చెందడంతో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఝాన్సీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విలేకరి రమణను ఓదార్చి భార్య మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, వైసిపి నాయకులు అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, కాళ్ల సంజీవరావు, గుంట సోమేశ్వరరావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రముఖ వైద్యులు బలగ మురళీ పాత్రికేయులు వెంకటరమణను పరామర్శించారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

దుర్గాప్రసాద్, సిఐ

ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, కవిటి మండలంలో ఎక్కడైనా మద్యం బెల్ట్‌షాపులు పెడితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. గతవారం రోజులుగా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా దాడులు చేపట్టి అక్రమంగా ఒడిశా నుంచి మద్యం తరలిస్తున్న నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు స్టేషన్ పరిధిలో దాడులు జరిపి ఏడు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా మూడు బెల్టుషాపులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దీంతో పాటు. మూడు ద్విచక్ర వాహనాలను కూడా స్వాదీన పర్చుకున్నట్టు తెలిపారు. మద్యం షాపులో ఎవరైనా ఎంఆర్‌పి ధరలకంటే అదనంగా అమ్మకాలు చేసినా, బెల్టుషాపులు పెట్టిన ఎక్సైజ్ సిఐ దుర్గాప్రసాద్ 8639959250, ఎస్ఐ 9440 830385 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- నరసన్నపేట

జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మాజీ సర్పంచ్ శిమ్మ జగన్నాథం సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం కోమర్తిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 55 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 25 మందికి కంటి ఆపరేషన్ల ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ శిబిరంలో ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ సుజాత, శంకర్ ఫౌండేషన్ అపాలమిక్ అధికారి వివేక్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో- ఆర్డినేటర్ సిహెచ్ అశ్విన్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాల అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు మరింతగా నిధులు రుణాలుగా మంజూరు చేసి వారి అభివద్ధికి కృషి చేస్తామని మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు ఇన్‌ఛార్జి పైల చక్రధర్ అన్నారు. 18 వార్డులో 32 సంఘాలుండగా వాటిలో మూడు సంఘాల సభ్యులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా డేటా ఎంట్రీ అప్లోడ్ చేసుకోవడం వల్ల భవిష్యత్‌లో మహిళా సంఘాలకు మరింతగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందెందుకు దోహదపడుతుందన్నారు. అదేవిధంగా సంఘాలు ఎలా నడపాలి, రుణాలు తీసుకోవడం, సక్రమంగా ఎలా చెల్లించాలనే అంశాలపై సభ్యులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హేమలత, తులసి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి

ప్రజాశక్తి- పోలాకి

మబుగాం హైస్కూల్‌లో ఆరు రోజుల నుంచి జరుగుతున్న యోగా శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. జీవితంలో యోగా ఒక భాగం కావాలని, అప్పుడే ఆనందమైన జీవితం, ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఆరు రోజులు జరిగిన హ్యాపీనెస్ కోర్స్‌లో ప్రతిరోజు పాల్గొనడం జరిగిందన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ వారణాసి సందీప్ యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయమం, సుదర్శన్ క్రియ చేయించారు. ఈ సందర్భంగా యోగా టీచర్లు, అమ్మన్నాయుడు, సురేంద్ర కాత్యాయని, వారణాసి సందీప్, వాలంటీర్లు శేఖర్, స్వప్న, పద్మజ, రామదార్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బగ్గు సుగుణమ్మ, జుత్తు తాతారావు, రామారావు, సాధకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలని టెక్కలి అర్బన్ సిఐ అంబటి విజయ్ కుమార్ అన్నారు. అదివారం మండలంలోని లింగాలవలసలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగాంగ ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అటోలో పరిమితికి మించి ప్రయాణికులు ఉంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆమదాలవలస: వాహనదారులు రోడ్డుపై ప్రయాణించే టప్పుడు సరైన భద్రత పాటించి గమ్యస్థానానికి సురక్షంగా

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న సిఐ విజయ్‌కుమార్

చేరుకోవాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. మండలంలోని సైలాడ పంచాయతీ కుమ్మరిపేటలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సైలాడ దాసునాయుడు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అలనాటి జ్ఞాపకాలు.. ఆనంద సాగరాలు

ప్రజాశక్తి- కవిటి

వారంతా సుమారు 20 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆలింగనాలూ చేసుకున్నారు. ఆడారు.. పాడారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించి తమ భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసిన గురువులను సన్మానించుకుని.. సాష్టాంగ ప్రణామాలు చేశారు. అలనాటి తమ చిలిపి చేష్టలు, మధుర జ్ఞాపకాలను తలచుకుని ఆనంద సాగరంలో తేలియాడారు. 1999-2004 పదో తరగతి విద్యార్థుల ఈ అపురూప కార్యక్రమానికి రాజపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వేదికైంది.

వజ్రపుకొత్తూరు: స్థానిక శివసాగర్ బీచ్‌లో అక్కుపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన 1987-1988 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా నిర్వహించారు. వివిధ కారణాలతో మృతి చెందిన మిత్రులకు నివాళ్లర్పించారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు

వజ్రపుకొత్తూరు : అపూర్వ కలయికలో పూర్వ విద్యార్థులు

చేసుకున్నారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు. అలనాటి ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణ, సారథి, ఉమా మహేశ్వరరావులను సత్కరించారు. దానయ్య, దానేంద్ర, విలాస్, ధనుంజయ, ఢిల్లీరాజు, వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలమైన విద్యుత్ స్తంభాల వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

విద్యుత్ స్తంభాలు మార్చాలని ఆందోళన

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటలో శిథిలమై ప్రజలకు ఇబ్బందిగా మారిన రెండు విద్యుత్ స్తంభాలను మార్చి వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శిథిలమైన స్తంభాల వద్ద ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత విద్యుత్ స్తంభాలు శిథిలమై కూలిపోయే స్థితిలో ఉన్నాయని, సముద్ర తీర ప్రాంతం కావడం, తీరానికి 20మీటర్లు దూరంలో ఉండడంతో ప్రతిఏటా సంభవిస్తున్న తుపానులు, ఈదురుగాలల కారణంగా కూలిపోతే పెను ప్రమాదం సంభవిస్తుందని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ ఎఇ దృష్టికి తీసుకు వెళ్లినా సమస్యపై స్పందించడం లేదని వారు వాపోయారు. స్తంభాలు కూలి ప్రమాదం జరగక ముందే అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రవికుమార్‌కు అభినందనలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జనసేన నాయకులు, సామాజిక వేత్త కొరికాన రవికుమార్‌కు కూటమి ప్రభుత్వం శనివారం సుడా చైర్మన్‌గా నియమించింది. ఈ మేరకు పలువురు జనసేన నాయకులు రవికుమార్‌కు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేనకు నమ్ముకుని ఉండి కష్టపడి పార్టీ కోసం పనిచేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. ఇందుకు పార్టీ అధిష్టానం గుర్తించి రవికుమార్‌రు పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు. అంతకుముందు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ పదవి ఇచ్చిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్, సిఎం చంద్రబాబు, మంత్రి కింజరాపు

మాట్లాడుతున్న జనసేన నాయకులు

అచ్చన్నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు కృతజ్ఞతలు తెలిపారు. రవికుమార్‌ను కలిసిన వారిలో మండల జనసేన నాయకులు డుక్క బాలరాజు, పిట్ట హరికృష్ణ, కిరణ్, చంటి, చింతల ప్రశాంత్ తదితరులున్నారు.

సంతబొమ్మాళి : ఆర్థికసాయం అందజేస్తున్న జగన్నాయకులు

అజయ్‌కుమార్‌కు ఆర్థికసాయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలం కాకరపల్లికి చెందిన వైసిపి కార్యకర్త ముడిదాన సింహాచలం కుమారుడు ఎం.అజయ్‌కుమార్ కొద్దిరోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు రూ.5 వేలు, సంతబొమ్మాళి ఎంపిపి మెరుగు రాజేశ్వరి, కార్యకర్తలు కలిపి రూ.17 వేలు నగదును ఆదివారం రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి అందించారు. సింహాచలంను కుమారుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: పాతటెక్కలి ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1993-94 ఏడాది పూర్వ విద్యార్థులు తోటి సహ విద్యార్థిని దున్న భాగ్యలక్ష్మికి రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. ఇటీవల భాగ్యలక్ష్మి భర్త దున్న చినబాబు సంతబొమ్మాళి మండలం శెలగపేటలో అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న తోటిమిత్రలంతా కలిసి ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించి ఓదార్చారు. అనంతరం రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలక గిరి, రమణయ్య, అట్టాడ కవిత, భారతి, జగదాంబ, దయవతి పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లెమ్మ, మెట్టూరు 1, 2లో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆదివారం టిడిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు స్వతహాగా వచ్చి రూ.100 చెల్లించి టిడిపి సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అడపాక శంకరరావు, పుచ్చ అప్పారావు, నాయకులు పెదకోట ఆదినారాయణ, పడాల వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని బానాపురం, వసుంధర పంచాయతీల్లోని పలు గ్రామాల్లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మాజీ ఎంపిపి ఎస్.మోహనరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జాడుపల్లి ఎంపిటిసి కదంబల పైడిరాజు, సయ్యద్ సిలార్, ఇప్పిలి కృష్ణారావు, కొర్ల

కర్లెమ్మలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న వైస్ ఎంపిపి

కగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని 10వ వార్డు పరిధిలోని మెట్టక్కివలస హడ్కో కాలనీలో టిడిపి ఇన్‌ఛార్జి నాగళ్ల మురళీధర్ యాదవ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాచకొండ రాజు, కనిమెట్ట అశోక్, కారుణ్య, ధర్మారావు, జగన్, చిన్నారావు పాల్గొన్నారు.

ముగ్గురు అరెస్టు

పొందూరు: మండలం దల్లవలసలో ఈనెల 5న కొంచాడ సూర్యంకు చెందిన ద్విచక్ర వాహనం చోరీకేసులో ఆదివారం ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన బొమ్మలాట మోహన్, ఎచ్చెర్ల మండలం పొన్నాడకు చెందిన మరో ఇద్దరు మైనర్లు ఈ చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు. వీరిని లోలుగు జంక్షన్ వద్ద పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదు బైక్‌ల రికవరీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

బైక్ చోరీలకు పాల్పడిన నిందితులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్ఐ చిన్నంనాయడు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన కిరణ్ కుమార్ అలియాస్ జన అనే వ్యక్తిని స్త్రై డ్రాప్ జంక్షన్ వద్ద ఎస్ఐ సిబ్బందితో కలిసి పట్టుకొని అతని వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను, అలాగే కంచిలిలో ఢిల్లీరావు వద్ద ఉంచిన ఒకబైక్‌ను స్వాదీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ తెలిపారు.

13న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఇచ్ఛాపురం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద సిజిఆర్ఎఫ్, ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 13న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడునని, సిజిఆర్ఎఫ్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సిజిఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి. సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.మసీల మణి, స్వతంత్రసభ్యులు డాక్టర్ ఆర్. సురేంద్రకుమార్ పాల్గొంటారని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి జరగనున్న కార్యక్రమంలో వినియోగదారులు తమ సమస్యలు పరిశీలించు కోవచ్చని తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

మెళియాపుట్టి: మండలంలోని పెద్దగుమడ శ్మశాన వాటికకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలతో నిర్మించనున్న రోడ్డుపనులకు బాణాపురం సర్పంచ్ పెద్దింటి చంద్రరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపనులు త్వరితగతిన జరిగేలా కృషి చేస్తానన్నారు. కార్య క్రమంలో వార్డుమెంబర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కోటబొమ్మాళి: మండలం కొత్తపల్లిలో ఎస్‌విఎం పాఠశాలలో ఆదివారం జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వంశీకృష్ణ, పూర్ణచంద్రరావు, వినయ్‌లు 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 50 మందికి మెరుగైన వైద్యకోసం రాగోలు జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రతినిధి శిమ్మ సింహాచలం, పాఠశాల కరస్పాండెంట్ నౌపడ రామమారావు, డైరెక్టర్ దుబ్బ శివాజీనాయులు, సలహాదారుడు నౌపడ సింహాచలం, ఆస్పత్రి ఏరియా మేనేజర్ అప్పన్న పాల్గొన్నారు.

డిజిఎం టీమ్ సభ్యులకు సన్మానం

రణస్థలం: రణస్థలం మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, మాజీ సర్పంచ్ దెయ్యం వసంతరావు, శ్రీనివాస్, కుమారులు ఉదయ్ భాస్కర్, కిషోర్ కుమార్, వీరరాజ్, నెలరాజ్ తదితర టీంసభ్యులు మండల కేంద్రం జె.ఆర్.పురం పంచాయతీలో టిడిపి సభ్యత్వం శతశాతం పూర్తి చేసినందుకు స్థానిక విజయనగరం ఎంపీ కార్యాలయంలో ఆదివారం ఆనందరావు టీం సభ్యులను ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి డిజిఎం కుటుంబసభ్యులు ఎనలేని సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న పిచ్చిమొక్కలు

టెక్కలి రూరల్ : మేజరు పంచాయతీ పరిధిలోని శ్యామసుందర స్వామి ఆలయం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పచ్చని పిచ్చిమొక్కల తీగలు అల్లు కోవడంతో ప్రమాదకరంగా మారింది. ఆలయ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు పూర్తిగా అల్లుకోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి అల్లుకున్న పిచ్చిమొక్కల తీగలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

అల్లుకున్న పిచ్చిమొక్కలు